**జరిగిన కథ :** నాగరాజు వల్ల పితృదత్తకు పుట్టిన ఫణిదత్తుడు.. మల్లయోధుడయ్యాడు. కాశీ గంగలో మునిగి, పాతాళానికి వెళ్లాడు. వరుణకన్యకలకు బంధవిముక్తి కల్పించాడు. శశాంకవతి అనే రాజకన్యను రక్షించి.. మిత్రుల దారిద్ర్యాన్ని పోగొట్టాడు. ఆమెతో కలిసి పారిపోతుండగా శశాంకవతిని ఎవరో ఎత్తుకుపోయారు. చివరికి విచిత్ర పరిస్థితుల్లో ఆమె జాడ తెలిసింది. ఆమెను తెచ్చుకునేందుకు చేసిన ప్రయత్నాల్లో ఫణిదత్తుడు పడరాని పాట్లు పడుతున్నాడు.




కాశీ మజిలీ కథలు 94

# కలిసొచ్చిన కాలం

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

సుబాహుడు మొదలైన వారంతా రాజభటుల వద్దకు వెళ్లి..

''ఆయనెవరు? ఎందుకిలా బంధించారు?'' అని ప్రశ్నించారు.

''అయ్యా! వీడో గజదొంగ. వీడి వద్ద దొంగతనం జరిగిన వస్తువొకటి దొరికింది. మిగిలిన వస్తువులెక్కడ దాచాడో చెప్పడం లేదు. అందుకే వీడికి ఈ శిక్ష పడింది'' అని సమాధానం చెప్పి, ఫణిదత్తుడితోసహా అక్కణ్నుంచి కదిలారు.

సుబాహుడు, సుప్రహస్తుడు, వజ్రకాయుడు.. ముగ్గురూ ఆనాడే కారాగారం ఆనుపానులు తెలుసుకుని వచ్చారు. దానికి చేరువలోనే ఒక సొరంగమార్గం తవ్వడం ఆరంభించారు. కొద్దిరోజులలోనే సొరంగం పూర్తయింది. ఒకనాటి రాత్రి కారాగారంలోకి చొచ్చుకు వెళ్లి.. అధికారుల కన్నుగప్పి, ఫణిదత్తుణ్ని రహస్యంగా విడిపించారు. బయటికి వచ్చిన తరువాత..

''మిత్రులారా! నేను వరుణలోకం నుంచి తెచ్చిన శంఖం పోగొట్టుకున్న దగ్గరినుంచి అన్నీ ఆపదలే కలుగుతున్నాయి. నేను బందీని కావడం ఇప్పటికిది రెండోసారి. మొదటిసారి ఆటవికుల వల్ల కలిగిన ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాను. అక్కడినుంచి బయటపడి, ఈ నగరానికి చేరుకున్నాను. సుబంధుని ఇంటికి వెళ్లబోతూ.. ఈ నగరానికి వెలుపల ఒక కాలువలో స్నానానికి దిగాను. ఆ ప్రవాహంలో నా ఉత్తరీయం కొట్టుకుపోయింది. ఇంతలో నీటిలో ఒక వస్త్రం కొట్టుకువస్తూ కనిపించింది. మరో ఆలోచన లేకుండా దానితో ఒళ్లు తుడుచుకుని, ఈ నగరంలోకి వచ్చాను. అది దొంగతనానికి గురైన వస్త్రమట. దాని చెంగున ఒక స్వర్ణకంకణం కూడా ఉంది. అది చూపించి, నన్ను రాజభటులు బంధించారు. 'మిగిలిన వస్తువులేవి?' అని అడిగితే నేనేం సమాధానం చెప్పగలను?! దాంతో వేరే దారిలేక శిక్ష అనుభవిస్తున్నాను. నా అదృష్టం కొద్దీ మీరు వచ్చి విడిపించారు. ఇంతకూ మీరు సుబంధుణ్ని కలుసుకున్నారా? శశాంకవతి క్షేమంగా ఉందా?!'' అని ప్రశ్నించాడు ఫణిదత్తుడు.

''మిత్రమా! ఈ చెడ్డకాలంలో మంచివార్తలు ఎక్కడ వినిపిస్తాయి?! శశాంకవతిని ఈ నగరపు మహారాజు సుయజ్ఞుడు చెరబట్టాడట. మనం ఆమెను విడిపించుకోవాలి. అందుకు మార్గం ఏమిటో చూడు'' అని జవాబిచ్చారు వారు.

ఫణిదత్తుడు వెంటనే వారికి సమాధానం చెప్పలేదు. కొంతసేపు ఆలోచించి..

''తెల్లవారేసరికి అధికారులు కారాగారంలో బిలాన్ని గుర్తిస్తారు. నా అంచనా సరైనదైతే వాళ్లు మనల్ని వెంబడిస్తారు. కనుక మనం మారువేషాలు ధరించి.. జాగ్రత్తగా సంచరించాలి'' అని చెప్పాడు.

అప్పటికప్పుడు వాళ్లు తమ రూపాలను మార్చుకున్నారు. ఎవరూ తమను గుర్తుపట్టలేని విధంగా నగరంలో సంచరిస్తూ.. శశాంకవతిని విడిపించే అవకాశం కోసం వెతకసాగారు. ఇంతలో నగరంలో కల్లోలం మొదలైంది. ప్రజలందరూ బిలమార్గాన్ని చూసేందుకు తండోపతండాలుగా తరలి వస్తున్నారు. ఎవ్వరికీ అనుమానం రాకుండా సొరంగం తవ్విన దొంగల చాకచక్యాన్ని చూసి అచ్చెరువొందుతున్నారు. అలా వచ్చినవారిలో శశాంకవతి చెలికత్తె కుమారవతి కూడా ఉండటం ఫణిదత్తుడి మిత్రబృందాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది.

రహస్యంగా ఆమెను సమీపించి..

''నువ్విక్కడ ఉన్నావేమిటి?'' అడిగాడు ఫణిదత్తుడు.

కుమారవతి అతణ్ని గుర్తించింది.

''మహానుభావా! దొరికావా?! మా రాకుమారి అనుమానం నిజమే అయింది. పద.. కోటకు పోదాం. నీ కొడుకును చూద్దువుగాని'' అని తీసుకుపోయింది.

ఆమె మాటలు విని, ఫణిదత్తుడు ఆశ్చర్యపోయాడు.

'పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తుందేమో అనుకుంటే.. ఈమె ఇలా మాట్లాడుతోందేమిటి?' అనుకుంటూనే ఆమె వెంట నడిచాడు. కోటలో సురక్షితంగా ఉన్న శశాంకవతిని కలుసుకున్నాడు. కొడుకును ఎత్తుకుని మురిసిపోయాడు. కొంతసేపటి తరువాత..

''ఈ సుయజ్ఞుని భార్య మా పెదతండ్రి కూతురే. మా బావ తెలియక నన్ను కామించి, ఒక గదిలో బంధించి చెరపట్టబోయాడు. నేను గట్టిగా అరిచేసరికి, నా అదృష్టం కొద్దీ ఆ అరుపులు మా అక్క చెవినపడ్డాయి. ఆమె తన భర్తను చివాట్లేసి, నన్ను చెర విడిపించి కాపాడింది'' అని చెప్పుకొచ్చింది శశాంకవతి.

''ఇదిగో మహానుభావా! మీ శంఖం. అడవిలో ఉన్న మీ చిన్నభార్యగారు మీకిమ్మని నా చేతికిచ్చారు'' అంటూ కుమారవతి, తాను ఈ నగరానికి వస్తుంటే అడవిలో చూసిన విశేషాలన్నీ చెప్పుకొచ్చింది.

'అయితే ఈ శంఖమే మళ్లీ నా ఆపదలన్నీ తీర్చిందన్న